# భట్రాజులు

"భట్రాజులు" అనగా వీరినే భట్టుమూర్తులు - అని కూడా అంటారు.

పూర్వకాలంలో రాజుల పరిపాలనలో రాజాస్థానాలలో కవీశ్వరులుగాను, విదూషకులుగాను, వందిమాగదులుగానువుండేడివారు. భట్రాజులు - వీరు సకల శాస్త్ర పాండిత్యం కలిగి మహారాజులను పొగుడుతూ, అగ్రహారాలు పొంది ధనధాన్యాలు పొంది ఆనాడు జీవనోపాధి సాగించేవారు. ఈనాటికీ రాజ్యాలు పోయినా, రాజులు పోయినా ప్రజలే రాజులుగా ప్రజలవద్దకు వెళ్లి వారిని పొగుడుతూ వారిచ్చిన బహుమతులు, ధన ధాన్య వస్తు వాహనాలు స్వీకరిస్తూ బ్రతుకుతెరువు సాగిస్తున్నారు. వీరు తెల్లని పంచెధరించి, తెల్లని లాల్చీ ధరించి, విలువైన కండువా భుజానవేసుకొని తలకు పాగాచుట్టి, బుగ్గ మీసాలతో చేతిలో బెత్తం పట్టుకొని, నుదుటనామాలు ధరించి, అచ్చతెలుగుతనం ఉట్టిపడే విధంగా వీరి ఆహార్యం వుంటుంది. జయీభవ, విజయీభవ, దిగ్విజయీభవ అని పొగుడుతూ ప్రజలను మెప్పిస్తూంటారు.

సాహసకృత్యాలను వర్ణించడంలో వీరు ప్రసిద్ధులు. నిజానికి మన తెలుగు వాస్తవ చరిత్రను పద్యరూపంలో భద్రపరచిన ఘనత ఈ భట్రాజులకే దక్కుతుంది.

పద్మశాలీలవద్ద పడిగ రాజులనే భట్టువారుండేవారు. ఈ భట్రాజులను ఆధారంగానే పగటివేషాలు పుట్టాయి. కూచిపూడి భాగవతుల పగటివేషాలలో ఇది కూడా ఒకటిగా ప్రసిద్ధికెక్కింది. మనల్ని యెవరైనా పొగుడుతుంటే "భట్రాజుపొగడ్తలకేంలే" అని అంటుంటాం. ఆనాడు భట్రాజులు రాజుల యశోకీర్తిని పొగిడి గానం చేసి వారి నుంచి కానుకలు అందుకునేవారు. ఎదుటివారిని ప్రసన్నంచేసుకోవటం వీరి విద్య.

ఈ భట్రాజు పగటివేషగాళ్లుగా వస్తూనే జయీభవ! విజయీభవ! ధరసింహాసనమై నభంబు గొడుగై, తద్దేవతల్‌భృత్యులై, బ్రహ్మాండాకారమై, శిరిభార్యా మణియై, విరించి కొడుకై... అంటూ వీరి ఆశీర్వచనాలు ఇలా సాగుతాయి.